క్లుప్తంగా

ఘనంగా బల్లల పండగ



పూజ చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అప్పయ్య నగర్‌లో వేంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా జరిగింది. ఆర్ అండ్ బీ దరి జాతీయ రహదారి పక్కనున్న వేంకటేశ్వరాలయం వెనుక గల రజక సంఘం వారి ఆహ్వానం మేరకు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు.

వైభవంగా చందనోత్సవం



చాదర్‌ను తీసుకెళ్తున్న ముస్లింలు, చిన్నారులు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్ నగర్ మస్జీద్–ఈ–అల్‌ఖాదీర్ ఆధ్వర్యంలో ఆదివారం హజ్రత్‌ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ముస్లింలు మసీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. సాయంత్రం చిన్నారులు నాత్తే కళాములు ఆలపిస్తూ గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్ తదితర ప్రాంతాల్లో చాదర్‌తో చందనోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దావత్ జరిపారు. వేడుకల అనంతరం చాదర్‌ను అజ్మీర్ షరీఫ్ వద్ద హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ సమాధి వద్ద సమర్పిస్తామని మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి వల్లి, బాష, సూరి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న మహిళా వాకర్స్

మురళీనగర్: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రహదారిలో ఫుట్‌పాత్‌పై యాచన చేస్తూ జీవిస్తున్న నిరాశ్రయులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. బి.లక్ష్మణ్ ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, కార్యదర్శి ఎస్.పుష్పలత, ఉపాధ్యక్షురాలు లీలానాయుడు, జి.లక్ష్మి, డి.శిరీష పాల్గొన్నారు.

పేదలకు వితరణ



దుప్పట్లు అందిస్తున్న ఆచార్య అవధాని

సీతంపేట: అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ ప్రాంగణంలో నారాయణసేవ చేస్తూ 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం అన్నదానంతోపాటు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యుడు పి.ఎస్.అవధాని చేతుల మీదుగా వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ మనిషికైనా పుణ్య కార్యాలతోనే జీవితం సార్థకమవుతుందన్నారు. 11 ఏళ్లుగా నిర్విరామంగా పేదలకు అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వంకాయల సన్యాసిరాజు, ఆర్.సి.జైన్, దాతలు ఎం.వి.వి.సత్యనారాయణ, జి.బి.కుమార్ పాల్గొన్నారు.

పందుల వీరవిహారం



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పందులు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పందులు వీరవిహారం చేస్తున్నాయి. స్టేషన్ ఆవరణలోకి అవి ఎలా వచ్చాయో తెలియని పరిస్థితి. పందులు గుంపులుగా సంచరిస్తుండటంతో ఫిర్యాదుదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడండి



వైద్యులతో సమావేశంలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి



సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన వైద్యులు

- కంచి కామకోటి పీఠాధిపతి పిలుపు
- శంకరమఠంలో వైద్యులతో సమావేశం

సీతంపేట: సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో వైద్యులు భాగస్వాములు కావాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పిలుపునిచ్చారు. వైద్య వృత్తిలో కొనసాగుతున్న ఉన్నత వైద్యులతో శంకరమఠంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు వైద్యులకు కొన్ని సూచనలు చేశారు. వైద్య వృత్తిలో సంగీతం కూడా ఒక భాగమేనన్నారు. ఆస్పత్రిలోని రోగుల మనసు రంజింప చేసేందుకు, వారిలో ఆధ్యాత్మిక చింతన కలిగేలా భక్తి పూర్వక ప్రవచనాలను వినిపించాలన్నారు. గర్భిణులకు మన సంప్రదాయాలను, పురాణాలను అదేవిధంగా సంగీతాన్ని కూడా వినిపించ గలిగితే ప్రహ్లాదుడు వంటి మంచి ఉన్నత బుద్ధులు కలిగిన బిడ్డలు కలుగుతారని పేర్కొన్నారు. అటువంటి వారు హిందూ ధర్మాన్ని కాపాడే విధంగా ఉంటారని, అందువల్ల వైద్యులు ఆస్పత్రి యందు దేవాలయ ప్రాంగణంలో ఉండే విధంగా భక్తి పారవశ్యం కలిగించేలా రోగులను చూడాలన్నారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మఠం కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

సమస్య మీది.. పరిష్కారం మాది

- 49వ వార్డును ప్రథమ స్థానంలో నిలుపుదాం
- డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు



అయ్యప్పనగర్‌లో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న అల్లు శంకరరావు

మురళీనగర్: ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వీలైనంత త్వరగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టాభిరెడ్డితోట, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను విన్నారు. ఎక్కడికక్కడ పారిశుధ్య పరిస్థితులు, అభివృద్ధి పనులు జరుగుతున్న తీరు, కాలువలు, కల్వర్టుల పరిస్థితిని పరిశీలించారు. 49వ వార్డును జీవీఎంసీలో అభివృద్ధి సాధనలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రజల సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నూరు శాతం అమలు చేశారని చెప్పారు. నవరత్న పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలుపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు.

కార్పొరేటర్ దృష్టికి సమస్యలు

అయ్యప్పనగర్‌లో నిరంతర నీటి సరఫరా పథకంలో తవ్విన గోతులు సరిగ్గా పూడ్చకపోవడం వల్ల రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు కార్పొరేటర్ అల్లు శంకరరావు గుర్తించారు. అక్కడ రోడ్లు, కాలువల నిర్మాణానికి అధికారులతో ఆయన మాట్లాడారు. అయ్యప్పనగర్‌లో యూజీడీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తక్షణం తొలగించాలని, కాలువలను శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని శంకరరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భట్రాజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు ఆదిరెడ్డి శ్రీను, వర్రి అప్పలనాయుడు, ఢిల్లీ రావు, జి.వెంకటరావు, ఆకుల గణేష్, చంద్రమౌళి, బి.శివరామప్రసాద్, బి.శంకర్, మున్నా, సిహెచ్.కె.కిషోర్, అప్పలనాయుడు, వెంకటరమణ, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ, వలంటీర్లు పాల్గొన్నారు.

మంచిగా జీవించండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ గౌరి



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా జోన్ ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: నేరాల జోలికి పోకుండా రౌడీ షీటర్లంతా మంచిగా జీవించాలని పోలీసులు హితవు పలికారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళా ఎస్‌ఐ గౌరి కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీ షీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కేసుల్లో ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా స్టేషన్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. సమాజంలో ఎలాంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, చక్కగా నడుచుకోవాలని సూచించారు. వారి రోజు వారీ పనులపై ఆరా తీశారు. నేరాల జోలికెళ్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

దివ్యాంగుల సమ్మేళనం



మాట్లాడుతున్న ప్రాంతీయ సంచాలకుడు నాగరాజు

సీతంపేట: దివ్యాంగులు ఆత్మన్యూనతా భావాన్ని పూర్తిగా విడనాడి అందరితో సమానంగా రాణించేలా ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమదృష్టి క్షమతా వికాసం(సక్షమ్) అనుసంధాన మండలి విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో దివ్యాంగుల సమ్మేళన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మున్సిపల్ పాలనాధికారి ప్రాంతీయ సంచాలకుడు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని పూర్తి స్థాయిలో పొందాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన దివ్యాంగులను, ఉన్నత స్థితి సాధించిన వారిని సన్మానించారు. సక్షమ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్సీపీసీ రిటైర్డ్ పౌర సంబంధాల అధికారి బి.హెచ్.విజయప్రసాద్, వెల్నెస్ ఓత్ స్థాపకుడు అవంతి, సక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.వి.ఎస్.ఎస్.మూర్తి, సభ్యుడు శ్రీధర్ పాల్గొన్నారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో పేకాటరాయుళ్లు, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుగా పేకాటాడుతున్న 10 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి టీపీటీ కాలనీలోని ఓ గెస్ట్ హౌస్‌లో కొందరు పేకాటాడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వారు గెస్ట్ హౌస్‌పై దాడి చేసి అక్కడ పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,92,200 నగదుతోపాటు ఒక కారు, ఒక బైక్, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ద్వారకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా.. పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్త జీవులపై కరుణ, ప్రేమ అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో ఆదివారం జంతువుల పట్ల కరుణ–అహింస, గాంధేయ–బౌద్ధ దృక్పథంపై ప్యానల్ చర్చ నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ క్యూరేటర్ ప్రొఫెసర్ పి.శంకరరావు ముఖ్య అతిథి మాట్లాడుతూ సర్వ జీవుల పట్ల ప్రేమ, కరుణ చూపాలని గాంధీజీ సిద్ధాంతాలు తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ రచించిన బాపు కుక్కురిప శతకం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మహాత్మా గాంధీజీకి జంతువుల పట్ల ఉన్న అభిమానం, బౌద్ధ సన్యాసి కుక్కురిపా నుంచి ఆయన నేర్చుకున్న 108 కవితల సంకలనంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. విశాఖ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ కేర్ ఆఫ్ యానిమల్స్ ప్రెసిడెంట్ ప్రదీప్ కుమార్‌నాథ్, మహా బోధి సొసైటీ స్థానిక అధిపతి ధమ్మాచారి విజయకుమార్, గాంధేయ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ, శ్రీలంక బౌద్ధ సన్యాసి హేమసిరి థెరో, గాంధీ అధ్యయనవేత్త రావిప్రోలు సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

మదర్ ఇండియా ట్రస్టు వార్షికోత్సవం నేడు

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు తృతీయ వార్షికోత్సవం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్జీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు మళ్ల వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ రూపొందించిన సావనీర్‌ను పోర్టు ట్రస్టు కార్యదర్శి వేణుగోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరిస్తామన్నారు. సంస్థ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం సమీప రెండో బ్రిడ్జిపై మూడు వాహనాలు ఢీకొట్టిన ప్రమాదంలో ఒక మహిళకు గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదివారం సాయంత్రం గాజువాక నుంచి ఎన్ఏడీకి స్కూటర్‌పై వస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చింది. దీంతో వెనుక వస్తున్న కారు డ్రైవర్ తన వేగాన్ని తగ్గించాడు. కారు వెనుక వస్తున్న బొగ్గు లారీ కారును ఢీకొట్టడంతో అది ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో స్కూటర్ వెనుక కూరున్న వరలక్ష్మి కిందకు పడిపోవడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మహిళను ఆస్పత్రికి తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

1న దేవస్థాన అనుబంధ ఆలయాల్లో కల్యాణోత్సవాలు

సింహాచలం: వచ్చే నెల 1న భీష్మ ఏకాదశి పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఈవో వి.త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో ఒకటో తేదీ రాత్రి 9.30 నుంచి గ్రామ తిరువీధి, కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ రోజు సాయంత్రం 4 నుంచి గ్రామతిరువీధి, రాత్రి 7గంటలకు కల్యాణోత్సవం, మాధవధార మాధవ స్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. అదే రోజు రాత్రి 8.30గంటలకు తిరువీధి ఉంటుందన్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి 7.30కి కల్యాణోత్సవం, రాత్రి 9 నుంచి తిరువీధి ఉంటుందని పేర్కొన్నారు.

సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగాలి



విజేతలతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సవాళ్లను స్వీకరిస్తూ వాటికి పరిష్కారాలు చూపే దిశగా యువత పయనించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాక్‌థాన్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు రిజిస్ట్రార్ బహుమతులు ప్రదానం చేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం మార్గదర్శకంలో విద్యార్థులు నవ్య ఆవిష్కరణలు జరపాలని ఆయన సూచించారు.

విజేతలు వీరే... హ్యాక్‌థాన్ విజేతల వివరాలను ప్రకటించారు. అల్టిమేట్ క్రియేషన్స్ సభ్యులు వి.మణికంఠ, పి.హరీష్, జి.అనీల్‌కుమార్, సిహెచ్.అశోక్, బి.భార్గవ్ ప్రథమ స్థానంలో, డాష్ సభ్యులు సుభాంగి సాహో, వై.శ్రీనివాస్, దర్శన్ శేరింగర్, అజయ్ శర్మ, హర్కీరట్ కౌర్ దాని ద్వితీయ స్థానం, ఇంట్–కాగ్నిటో బృందం ఆశిష్ సింగ్, మేఘన దత్త, భావన, దివోదశి సింఘ్‌లు తృతీయ స్థానంలో నిలిచారు. రఘు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన క్రియేటివ్ సీ కోడర్ సభ్యులు ఎం.ఎస్.సాయి నీరజ్, ఎల్.అమృత యశస్విని, పి.జగదీష్ ప్రత్యేక బహుమతిని సాధించారు.

వేటూరి పాటలు అజరామరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్

సీతంపేట: తెలుగు భాష ఉన్నంత వరకు వేటూరి పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయని విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్ కుమార్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్ మాట్లాడుతూ 'సినీ కళామతల్లి నుదుట సింధూరం, అలనాటి వాగ్గేయకారులు త్యాగయ్య, అన్నమయ్య, భక్తరామదాసుల ఏక అవతారమే వేటూరి' అని కీర్తించారు. ఈ సందర్భంగా ఝుమ్మంది నాదం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. రాజేంద్ర ప్రసాద్, జ్యోత్స్న పాడిన రాగాల మేళవింపా.. రమేష్ పట్నాయక్, శృతి పాడిన వే వేళా గోపెమ్మలా.. ఎంవీఆర్ నాగేశ్వరరావు, సూర్యకుమారి పాడిన మనసులోని కోరిక.. జోగారావు, రచన శ్రీకృతి పాడిన స్వప్న వేణువేదో.. ఫణిభూషణ్, కల్యాణి పాడిన ఒకపూల బాణం.. ధీరజ్ పాడిన కంచికి పోతావా కృష్ణమ్మ.. ఫణిభూషణ్, దీప్తి పాడిన పూసింది పూసింది పున్నాగా.. శశిరాణి పాడిన ఓహో మేఘమాల వంటి ప్రజాదరణ పొందిన గీతాలతో అలరించారు. ఆత్రేయ పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కళారంగ ప్రముఖులు కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎస్.ఎన్.రాజు, సన్ మూర్తి, టి.రాధారాణి తదితరులు వేటూరి సేవలను కొనియాడారు. ముందుగా వేటూరి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

చరిత్రలో నిలిచేలా సీఎం జగన్ పాలన



మాట్లాడుతున్న పులపా రవీంద్రనాథ్ ఠాగూర్

తాటిచెట్లపాలెం: జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు పులపా రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన నాటి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. వలంటీర్–సచివాలయ వ్యవస్థతో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలను చేరువ చేసి, నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందచేస్తే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న మరో సాహసోపేత నిర్ణయం మూడు రాజధానులని, ఉత్తరాంధ్రవాసులకు విశాఖ పరిపాలన రాజధాని ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అన్ని ప్రాంతాలను సమానాభివృద్ధి చేయాలనే ఆయన కోరిక తీరి త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన సాగించాలని తామంతా ఆశిస్తున్నట్లు ఠాగూర్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పంచకర్ల రమేష్‌బాబును నియమించడం సీఎం వైఎస్ జగన్ విజ్ఞతకు నిదర్శనమన్నారు. జనాభా నిష్పత్తిలో రాజకీయ పదవులు, ప్రభుత్వ అధికారాలు ఇవ్వాలని ఆయన కోరారు. కాపు నాయకులు సూరాబత్తుల తిరుపతిరావు, పంచిరెడ్డి జయకుమార్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గురుశిష్యుల బంధం గొప్పది



ఉపాధ్యాయులు, విద్యార్థులను సత్కరిస్తున్న భారత వికాస్ పరిషత్ ప్రతినిధులు

సీతంపేట: సృష్టిలో గురుశిష్యుల బంధం ఎంతో పవిత్రమైనదని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యుడు పి.ఎస్.అవధాని అన్నారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో గురువందన్ ఛాత్రాభినందన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలతో సామాజిక సేవలతోపాటు ప్రగతి కూడా సాధ్యపడుతుందన్నారు. భారత వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ ద్వారా దేశభక్తితో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. అతిథులు రమేష్‌చంద్ జైన్, వంకాయల సన్యాసిరాజు, ఎం.వి.వి.సత్యనారాయణ ప్రసంగించారు. గురువందనం ఛాత్రాభినందన్‌ను పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా శ్రీకృష్ణ విద్యామందిర్ ఉపాధ్యాయిని ఎస్.ఎల్.ఎన్.సౌజన్య, జీవీఎంసీ ఉపాధ్యాయుడు జి.వెంకటరమణ, వాగ్దేవి స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.వెంకటరమణలను ఘనంగా సన్మానించారు. ఉత్తమ విద్యార్థులుగా ఎం.ఆశ్రిత శర్మ, హిలాల్, హేమచంద్ర సాయిలను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ విశాఖ శాఖ అధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ ఎం.వి.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి.మాణిక్యాలరావు, సిహెచ్.వి.సత్యనారాయణ, పి.రవికుమార్, కొణతాల రాజు, వి.ప్రభాకర్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న వీవీవైఎం సభ్యులు

మురళీనగర్: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని విశాఖ వివేకానంద యువ మహామండలి కార్యదర్శి కె.విద్యాధరసింగ్ అన్నారు. మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వీవీవైఎం ఆధ్వర్యంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు సహకారంతో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం విషయంలో ఉన్న అపోహలు నమ్మవద్దని, రక్తదానం చేయడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవని చెప్పారు. ముందుగా వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 25 మంది నుంచి రక్తం సేకరించారు. శిబిరం నిర్వహణకు వీవీవైఎం సహాయ కార్యదర్శి ఎన్ఆర్‌కే చౌదరి, కోశాధికారి ఎన్‌సీహెచ్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సోమరాజు, డి.వెంకటరావు, పి.చంద్రశేఖర్, కె.లక్ష్మీనారాయణ, కె.హృదయ్ సహకరించారు.

అ'పూర్వ' కలయిక.. ఆనంద వేడుక



సమావేశమైన రైల్వే హైస్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: మర్రిపాలెంలోని రైల్వే హైస్కూల్‌లో 1984–85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో సందడి చేశారు. వన భోజన కార్యక్రమం జరుపుకొని ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. నగరంతో పాటు వివిధ చోట్ల స్థిరపడినవారంతా తమ కుటుంబాలతో ఇక్కడ కలిశారు. అందరూ సరదాగా ఆటపాటలతో గడిపారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.